జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ **వార్త** తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 9-9-2025 శ్రీకాకుళం సంపుటి: 2 సంచిక: 449 పేజీలు: 4 వెల : రూ.7



## ఎరువుల కోసం ఆందోళన వద్దు

*** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు**

**శ్రీకాకుళం:** రైతులు ఎరువుల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. సోమవారం శ్రీకాకుళం మండలం తండేం వలసలోని రైతు సేవా కేంద్రంలో ఎరువులు పంపిణీ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో 23 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీ చేశామని, త్వరలో మరో 3 వేల మెట్రిక్ టన్నులు రానున్నాయని తెలిపారు. ఎవరైనా ప్రైవేట్ డీలర్లు ఎరువులతో పాటు ఇతర వస్తువులను బలవంతంగా అమ్మడానికి ప్రయత్నిస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక ఫోన్ నెంబర్ ఏర్పాటు చేశామని తెలిపారు.



# ఎరువు.. ఏదయా!

* షాపుల ముందు గంటల తరబడి రైతుల పడిగాపులు * క్యూ లైన్లు కడుతున్న అన్నదాతలు * సరిపడా నిల్వల్లేక అన్నదాతల అగచాట్లు * వ్యవసాయ మంత్రి ఇలాఖాలోనే యూరియా కోసం అవస్థలు * బ్లాక్‌కు తరలిపోతోందంటున్న ప్రతిపక్షాలు * రైతులకు మద్దతుగా వామపక్షాలు ధర్నాలు * రైతు సమస్యలపై పోరాటానికి నేడు వైసీపీ పోరుబాటు * గ్రామాల్లో 'రైతులకు చేరువగా అధికారులు' కార్యక్రమం * రైతులు ఆందోళన చెందవద్దంటున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 8 (వార్త):** కూటమి ప్రభుత్వం పుణ్యమాని ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎరువుల కోసం నానా అగచాట్లు పడాల్సి వస్తోంది. రైతు సేవా కేంద్రాలు, గ్రోమోర్ కేంద్రాలు, ప్రైవేట్ ఎరువుల షాపుల వద్ద గంటల తరబడి వ్యవసాయ పనులు మానుకుని గంటల రైతులు క్యూలైన్లలో వేచి ఉంటున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఇలాఖా అయిన శ్రీకాకుళం జిల్లాలోనే ఇలాంటి పరిస్థితి ఉందంటే మిగతా జిల్లాలో ఇంకెలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఎరువుల నిల్వలపై అధికారులు చెబుతున్న లెక్కలకు, క్షేత్ర స్థాయిలో కనిపిస్తున్న నిల్వలకు పొంతన లేకుండా ఉంది. రైతు సేవా కేంద్రాలకే కాదు.. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, జిల్లా కేంద్ర మార్కెటింగ్ కేంద్రాలకు సైతం అరకొరగా కేటాయిస్తుండడంతో క్షేత్ర స్థాయిలో కొరత ఎక్కువగా కనిపిస్తోంది. ఇదే సాకుతో కృత్రిమ కొరత సృష్టిస్తున్న డీలర్లు ఎమ్మార్పీకి మించి అమ్ముతూ దోపిడీకి పాల్పడుతున్నారు. అవసరం లేకున్నా ఇతర మందులను బలవంతంగా అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. కాగా, ఎరువులపై రైతులపై వివరించేందుకు జిల్లా యంత్రాంగం గ్రామాల్లో పర్యటిస్తోంది. 'రైతులకు చేరువగా అధికార యంత్రాంగం' కార్యక్రమం నిర్వహిస్తోంది. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల్లోకి వెళ్లి ఎరువుల వాడకం, తదితర అంశాలపై వివరిస్తున్నారు. కాగా, జిల్లాలో 1198 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి త్రినాథ స్వామి తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో 487 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల వద్ద 331 మెట్రిక్ టన్నులు, మార్క్ ఫెడ్ బఫర్‌లో 380 మెట్రిక్ టన్నులు యూరియా ఉందని వివరించారు. మరో రెండు రోజుల్లో ఐపిఎల్ కంపెనీ నుండి 1500 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వస్తుందని ఆ యూరియా కూడా రైతులకు పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. యూరియాపై ఆందోళనలు చెందవద్దన్నారు.

## ఎరువులకు క్యూ..

**నరసన్నపేట/జలుమూరు:** నరసన్నపేట మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు క్యూలైన్ కట్టారు. ఏ దుకాణానికి ఎరువు వచ్చిందో తెలుసుకొని హుటాహుటిన ఆయా దుకాణాల వద్దకు రైతులు పరుగులు తీస్తున్నారు. సోమవారం ఉదయం నరసన్నపేట ప్రధాన రహదారిలో ఉన్న మన గ్రోమోర్ దుకాణానికి 300 బస్తాలు యూరియా వచ్చిందని తెలియడంతో రైతులు అక్కడకు చేరుకుని లైను కాశారు. ఒక బస్తా యూరియా అయిన సంపాదించేందుకు అవస్థలు పడ్డారు. ఉదయం 6 నుంచి ఎరువుల షాపుల వద్ద లైన్లో నిలబడ్డామని, ఇప్పుడు టోకెన్లు లేవు అంటున్నారని నరసన్నపేట వ్యవసాయ అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



## యూరియా కోసం తిప్పలు



**వీరఘట్టం:** ఆరుగాలం పాటు కష్టపడిన రైతన్నలకు అండగా ఉంటుందని, ఇది రైతన్నల ప్రభుత్వమని పదేపదే ప్రకటనలు గుప్పిస్తున్న కూటమి ప్రభుత్వం ఎరువులు పంపిణీ చేయలేని స్థితికి చేరుకుందన్న విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తోంది. వీరఘట్టం సచివాలయం 4కు ఎరువులు వచ్చాయని తెలుసుకున్న రైతులు సోమవారం పోటెత్తారు. వారిని అదుపుచేయలేక ఇటు అధికారులు, అటు పోలీసులు నానా ఇబ్బందులు పడ్డారు. తమకు ఎరువులు దక్కలేదన్న కోపంతో పలువురు రైతులు కోపోద్రిక్తులే నిరసన వ్యక్తం చేస్తూ రోడ్డెక్కి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మండల కేంద్రం వీరఘట్టంకి కేవలం 440 బస్తాలు యూరియా రావడంతో ఎవరికి పంపిణీ చేయాలో తెలియక వ్యవసాయాధికారులు తలలు పట్టుకున్నారు.

## పోరాటం తప్పదు

**నరసన్నపేట/జలుమూరు:** యూరియా, డీఏపి వంటి ఎరువులు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ అన్నారు. సోమవారం నరసన్నపేట మండల కేంద్రంలో ధర్నా సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు సరిపడా ఎరువుల పంపిణీలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ ఆధారిత జిల్లా అని, ఈ జిల్లాలో రైతులు వ్యవసాయం చేసుకోవడానికి ఎరువులు సక్రమంగా అందించకపోవడం సిగ్గుచేటన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నారాయణరావు, లవకుమార్, భాస్కరరావు, మన్మధ, వాసు, రాజు,కుమార్, చిన్ని పాల్గొన్నారు.




## బ్లాక్ మార్కెట్‌కు ఎరువులు

**కొత్తూరు:** పంట కాపాడుకోవాలన్న ప్రతి రైతు హృదయంలో ఇప్పుడు ఒకటే ప్రశ్న.. ఎరువు ఎక్కడ దొరుకుతుంది అనేదే. కొత్తూరులో యూరియా కొరత రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. సోమవారం స్థానిక గ్రోమోర్ సెంటర్ వద్ద వందలాది రైతులు ఎరువుల కోసం తరలివచ్చి క్యూలైన్లలో నిల బడ్డారు. రోజంతా వేచిచూసినా యూరియా కొందరికే అందడంతో మిగతా వారంతా వెనుదిరిగారు. రూ.260 ఉన్న యూరియాను బ్లాక్ మార్కెట్‌లో రూ.600కు పైగా విక్రయి స్తున్నారు. పంట తప్పనిసరి ఎరువులు కావాల్సివుండడంతో రైతులు బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేసుకున్నారు. యూరియా కావాలంటే ఇతర వస్తువులు కొనాలని బలవంతం చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.



## రైతుల సమస్యలపై.. నేడు వైసీపీ పోరుబాట

**శ్రీకాకుళం:** రైతుల సమస్యలపై మంగళవారం వైసీపీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం నిర్వహించనున్నామని పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పలాస. టెక్కలి డివిజన్ కేంద్రాలలో ఆర్డీవోలకు వినతి పత్రాలు ఇవ్వాలని, శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట, ఎచ్చెర్ల నియోజకవర్గ కేంద్రాలలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఎరువుల కొరత, తదితర సమస్యలపై రైతుల తరపున వినతిపత్రాన్ని అధికారులకు అందజేస్తామని తెలిపారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



**మందస, సెప్టెంబర్ 8(వార్త):** ఎరువుల దుకాణాలపై విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఎంపీడీఓ వై.వెంకటరమణ, వ్యవసాయాధికారి జి.నాగరాజులు ఎరువుల పంపిణీపై తనిఖీలు నిర్వహిస్తుండగా సోమవారం విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు కూడా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రైతులకు ఇస్తున్న ఎరువులు, నిల్వలు, పంపిణీ తదితర వివరాలను తనిఖీ చేసి, ఆన్లైన్ విధానంలో కూడా చెక్ చేశారు. ఎరువులు అధిక ధరలకు అమ్మిన, నకిలీ ఎరువులు విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు పుస్యా ఉదయ్ కుమార్, కొండల జ్యోత్స్న, కొత్తకోట కన్న, మద్ది సీతారాం ఉన్నారు.

## ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని
# ఘనంగా నిర్వహిద్దాం

- 17 నుంచి అక్టోబర్ 2 వరకూ సేవా పక్షోత్సవాలు
- ఈ కార్యక్రమాలను సమన్వయంతో విజయవంతం చేద్దాం
- సేవా పక్వాడ్ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనంద్, రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్



**శ్రీకాకుళం, సెప్టెంబర్ 8 (వార్త):** ప్రధాని మోదీ జన్మదినోత్సవంతో పాటు సేవా పక్షోత్సవాలను ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకూ ఘనంగా నిర్వహిద్దామని సేవా పక్వాడ్ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అడారి ఆనంద్, రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్ తెలిపారు. సోమవారం శ్రీకాకుళం భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో సేవా పక్షోత్సవాల జిల్లా కార్యశాల జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 రోజులపాటు అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, మున్సిపాలిటీలు ముఖ్య ప్రదేశాలలో, రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు స్వచ్ఛత అభియాన్ కార్యక్రమాలు, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు మాట్లాడుతూ అందరూ సమన్వయంతో ఈ కార్యక్రమాలను విజయవంతం చేద్దామన్నారు. ఐటీ జిల్లా కన్వీనర్ రావాడ పురుషోత్తం పవర్ ప్రజంటేషన్ ద్వారా నిర్వహించే కార్యక్రమాలపై వివరించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాల్, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జి , శెవ్వాన ఉమామహేశ్వరీ, పూర్వ జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్సులు చింతు పాపారావు, పేడాడ సూరపునాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల గోవింద్, పూర్వ జిల్లా ఉపాధ్యక్షులు కొర్రాయి బాలకృష్ణ యాదవ్, జిల్లా నూతన, పూర్వ పదాధికారులు, మండల అధ్యక్షులు, వివిధ మోర్చా నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండలాల కన్వీనర్, కో కన్వీనర్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 23 నుంచి కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి జాతర




**శ్రీకాకుళం, సెప్టెంబర్ 8 (వార్త):** కోటబొమ్మాళిలో కొలువైన కొత్తమ్మ తల్లి జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించిన నేపథ్యంలో ఈనెల 23 నుంచి 25 వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి సమక్షంలో జిల్లా అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రముఖ ఆల యాల తరహాలో క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఉచిత దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలని, శోభాయాత్ర, గ్రామీణ క్రీడలు, సాంస్కృతిక కార్యక్ర మాలు, ఎగ్జిబిషన్, ఫైర్వర్క్స్, హెలికాప్టర్ రైడింగ్ వంటి కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించాలని సూచించారు. ఆలయానికి రంగులు వేయడం నుంచి కొత్తపేట వరకు విద్యుత్ అలంకరణ ఆకర్షణీయంగా ఉండాలన్నారు. ఆహ్వానాలు అందరికి చేరేలా చూడా లని, రోజూ 25 వేల మందికి అన్నదానం మజ్జిగతో కలిపి అందించాలన్నారు. చిన్నపిల్లలకు పాలు, భక్తు లకు మంచినీరు అందించాలని కోరారు. క్యూలైన్లు, బారికేడ్లు, టెంట్లు, లౌడ్‌స్పీకర్లు, డ్రోన్ కెమెరాలు, ఎల్ ఈడి స్క్రీన్లు, ఆన్‌లైన్ సిస్టమ్, శానిటేషన్, మెడికల్ క్యాంపులు, ఫైర్ ఇంజిన్లు, ఆర్టీసీ ప్రత్యేక బస్సులు, పోలీసు బందోబస్తు అన్నీ విభాగాల సమన్వయంతో జరిగేలా చూడాలన్నారు. జాతరలో నిర్బంధ వసూళ్లు జరగకుండా దేవాదాయ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, గత సంవత్సరం లాగానే ఈ సారి కూడా భక్తులకు ఏ మాత్రం ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ జాతర విజయ వంతం కావడానికి విభాగాల వారీగా అధికారులకు బాధ్యతలు కేటాయించి నట్లు వివరించారు. మొత్తం కార్యక్రమా నికి టెక్కలి ఆర్డీవోను ఇన్‌చార్జ్‌గా నియ మించామని, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పర్యవేక్షణ బాధ్యతలు టెక్కలి ఎస్డీపీవోకు అప్పగించినట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర రావు, టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ కింజరాపు హరిప్రసాద్, బోయిన రమేష్ పాల్గొన్నారు.

## పోలీసు జాగిలం టినా మృతి



**శ్రీకాకుళం,సెప్టెంబర్ 8(వార్త):** పోలీసు శాఖలో ఏడేళ్ల విశేష సేవలందించిన పోలీసు జాగిలం 'టినా' అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిచినట్లు జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. టినా మృతి పట్ల ఎస్పీ సంతాపం వ్యక్తం చేసి, అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఆదేశించారు. ఈ మేరకు ఆర్మ్ రిజర్వ్ కార్యాలయం ఆవరణంలో అదనపు ఎస్పీ కె.వి.రమణ 'టినా' భౌతికకాయానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం ఎచ్చెర్ల ఆర్మ్ రిజర్వ్ ఆవరణంలో స్మశాన వాటికలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శేషాద్రి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శంకర్ ప్రసాద్, ఆర్ఎస్ఐలు, పోలీస్ డాగ్‌స్క్వాడ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం






## కూటమి ప్రభుత్వంలో..

# మహిళలే మహారాణులు





- ఆమదాలవలసలో స్త్రీశక్తి భారీ బహిరంగ సభ
- తరలివచ్చిన మహిళా లోకం
- వేదిక వరకూ కూన వెంట అడుగులో అడుగు
- ఆమదాలవలస జనసంద్రం
- సూపర్ సిక్స్ సూపర్ హిట్
- మహిళలకు అండగా కూటమి ప్రభుత్వం
- వారి కోసమే అనేక సంక్షేమ పథకాలు
- మహిళలు అభివృద్ధి చెందితే.. ఆ కుటుంబమే ప్రగతిపథంలోకి
- మరో 20 ఏళ్లు కూటమి ప్రభుత్వమే
- వైసీపీ పిల్ల సైకోల తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టండి
- రాష్ట్ర పీయూసీ చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్

**ఆమదాలవలస/శ్రీకాకుళం, సెప్టెంబర్ 8 (వార్త):** ఆమదాలవలస మండల కేంద్రం స్త్రీ శక్తితో నిండిపోయింది. ఎక్కడ చూసినా మహిళలే సంద్రం మాదిరి కనిపించారు. బూర్జ, సరుబుజ్జిలి, ఆమదాలవలస మండలాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు సోమవారం ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన స్త్రీశక్తి సమావేశానికి తరలివచ్చారు. ఆమదాలవలస బ్రిడ్జి నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో ఎమ్మెల్యే కూన రవికుమార్ అడుగులో అడుగు వేశారు. అడుగడుగునా అక్క చెల్లెమ్మలు నీరాజనాలు పలికారు. తమ అభిమాన నేతతో పాటు ర్యాలీలో కదం తొక్కారు. ఆమదాలవలస రోడ్డు మహిళా మణులతో సంద్రాన్ని తలపించింది. కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే కూన రవి మహిళామణులను ఉద్దేశించి ఉద్వేగంతో ప్రసంగించారు. మహిళలు అండగా ఉంటే మరో 20 ఏళ్లు కూటమిదే అధికారమన్నారు. అసత్య ప్రచారాలతో ప్రభుత్వంపై విషం చిమ్ముతున్న వైసీపీ త్వరలో కనుమరుగవ్వడం ఖాయమన్నారు. సీఎం చంద్రబాబు మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ అయిందన్నారు. మహిళలకు రాష్ట్రమంతా ఉచిత బస్సు ప్రయాణం కల్పించినట్లు చెప్పారు. ఏడాది పాలనలో ఆమదాలవలస నియోజకవర్గంలో రూ.530 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. బూర్జ, సరుబుజ్జిలి మండలాల సరిహద్దు ప్రాంతంలో మన పిల్లల భవిష్యత్తు కోసం రూ.30 వేల కోట్లతో 3,200 మెగావాట్ల థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీ పిల్ల సైకోలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వారికి తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ మొదలవలస రమేష్, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా, నియోజకవర్గానికి చెందిన మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.













జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఉపాధ్యాయులకు సన్మానం

**కోటబొమ్మాళి, సెప్టెంబరు 8(వార్త):** తిలారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ముగ్గురు ఉపాధ్యాయులకు గురుపూజోత్సవం విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయ వేషధారణలో ఉంటూ, బ్లాక్ బోర్డ్ పై పాఠాలు బోధిస్తూ, ఉపాధ్యాయులకు కొన్ని ఆటలు నిర్వహించి, గురువులకు పాదపూజ చేసి, విద్యార్థిని విద్యార్థులు దుశ్శాలువతో సన్మానించారు, అనంతరం ఆటలకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.



# ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం : ఎన్ఈఆర్



**జి.సిగడాం, సెప్టెంబరు 8(వార్త):** ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే నమస్తే ఎచ్చెర్ల .. మన ఊరికే – మన ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నడుకు దిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) తెలిపారు. శుక్రవారం కోష్ట పంచాయతీలో ఆయన పర్యటించారు. రూ.21 లక్షల10వేల తో పూర్తి చేసిన వివిధ పనులను ప్రారంభించారు.అనంతరం రైతు సేవా కేంద్రం వద్ద యూరియా పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యే చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామన్నారు. జి.సిగడాం మండలంను అభివృద్ధి చేస్తానని చెప్పారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో దేశాన్ని, రాష్ట్రాన్ని ఎలా ముందుకు తీసుకువెళ్లాలో ఆలోచించగల విజన్ ఉన్న నాయకులు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు అన్నారు. గ్రామాల్లో బీటీ, సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం, తాగునీరు అందించి అభివృద్ధి చెందిన గ్రామాలుగా తీర్చి దిద్దిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లు జోగినాయుడు డీసీఎమ్ఎస్ అద్యక్షులు' చౌదరి అవినాస్, మండల కూటమి అద్యక్షులు కుమరాపు రవికుమార్, పైల విష్ణుమూర్తి, మీసాల రవికుమార్, మండల పీఏసీఎస్ అద్యక్షులు బెవర జగన్నాధరావు, నక్క మురళీ,బాలబోమ్మ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో జి.రామకృష్ణ, తహసీల్దార్ ఎం.సరిత, బురాడ వెంకటరమణ, సాకేటి నాగరాజు, టంకాల మౌళీశ్వరరావు, కుదిరెళ్ల బుజ్జి,తాళ్లబత్తుల పైడిరాజు, గొలివి శ్రీనివాసరావు, పిఆర్ ఏఈ లతాశ్రీ, ఆర్డబ్ల్యూసీ ఏఈ కుసుమ, ఏపీఎ చోళ్ల సత్యనారాయణ, మీసాల రామకృష్ణ, జిల్లా బీజేపీ కార్యదర్శి వర్జపర్తి రఘురాం పలిశెట్టి సూర్యనారాయణ, పలు శాఖల అధికారులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూరియాను అధికంగా వినియోగిస్తే అనర్థమే



**జి.సిగడాం, సెప్టెంబరు 8(వార్త):** వరి సాగులో పరిమితికి మించి యూరియాను వినియోగిస్తే పంటలకు పురుగులు, తెగుళ్లు, దోమపోటు సంక్రమించి భూసారం తగ్గిపోతుందని మండల ప్రత్యేక అధికారి చంద్ర జీవన్ ఎంపీడీఓ జి. రామకృష్ణ మండల వ్యవసాయాధికారి బి.బాబ్జి తెలిపారు. జి.సిగడాంలో జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు నానో యూరియా, డీఏపీ వాడకం, డ్రోన్ ద్వారా చల్లడంపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. యూరియా, డీఏపీ అధికంగా వినియోగించడంతో రైతులు ఎక్కువ మొత్తంలో పంట మదుపులు పెట్టే అవకాశం ఉందని, నానో యూరియా, డీఏపీ ద్రావణాన్ని వాడితే అతి తక్కువ ఖర్చుతో డ్రోన్ల సాయంతో వరి పంటలో చల్లేందుకు దోహదపడుతుందన్నారు. ఈ విషయంపై రైతులు అవగాహన పెంచుకొని యూరియా బస్తాల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడు తులసీ ప్రసాద్ సాహు, అగ్రికల్చరల్ అసిస్టెంట్ మాధవి, బిల్ కలెక్టర్ గుణబాబు, వ్యవసాయశాఖ సిబ్బంది. పాల్గొన్నారు.

# ఎరువుల వాడకంపై అవగాహన, పంపిణీ



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 8(వార్త):** ఎరువుల పంపిణీ మరియు దానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. రైతుల సమక్షం లో అవగాహన కల్పించారు. రైతులకు ఎరువుల సమయానుకూల వినియోగం, సరఫరా పద్ధతులపై సూచనలు అందించారు. ప్రత్యేకంగా ఈ కార్యక్రమంలో పాంప్లెట్ విడుదల చేయటం, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను విన్నారు.మండల వ్యవసాయ అధికారి అజయ్ కుమార్, తహసీల్దార్ వెంకట రావు, ఎం.పి.డిఓ రామారావు లు పాల్గొని రైతులకు ఎరువుల శాస్త్రీయ వినియోగం, అధిక మోతాదులో వాడకం వల్ల కలిగే నష్టాలు,సమయానుకూలంగా వేసినప్పుడు పంట దిగుబడి పెరుగుదల వంటి అంశాలను వివరించారు. అలాగే, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, రైతులకు అందుబాటులో ఉంచిన ఎరువుల పంపిణీ విధానాలపై వివరాలు తెలియజేశారు.రైతులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేయగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.. ఈ సందర్భంగా అధికారులు రైతులు భయాందోళన లేకుండా తమ పంట అవసరాలకు సరిపడా ఎరువులు సమయానికి అందుకుంటారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని, ఎరువుల సరైన వినియోగంపై అవగాహన పొందారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బంది, రైతు సంఘాల ప్రతినిధులు కూడా ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొని సహకరించారు.

## జిల్లా ఉత్తమ అవార్డు గర్వకారణం



**వీరఘట్టం, సెప్టెంబరు 8(వార్త):** వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాల అర్ధశాస్త్ర అధ్యాపకుడు మజ్జి గోవిందరావు జిల్లా ఉత్తమ అధ్యాపకునిగా సత్కారం పొందడం గర్వకారణమని ప్రిన్సిపాల్ త్రినాథ్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయనను ఘనంగా సత్కరించిన సందర్భంగా మాట్లాడారు. అవార్డు రావడం విద్యారంగంలో వారి చేసిన సేవకు నిదర్శనం అని ఆయన కొనియాడారు. ఇదే స్పూర్తితో ముందుకు వెళ్లి కళాశాల అభివృద్ధిని ఇనుమడింపచేస్తామని, ప్రభుత్వ ఆశయాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# కంబిరిగామ్ భూమిపై రాజకీయాలు చేస్తే ఊరుకోం



**పలాస, సెప్టెంబరు 8(వార్త):** కంబిరిగామ్ భూమిపై రాజకీయాలు చేస్తే ఊరుకోమని, కోరాడ శ్రీనివాసరావు కొనుగోలు చేసిన కంబిరిగాం చౌదరి భూములపై ఇటీవల పత్రికల్లో వస్తున్నా వార్తలు అవాస్తవమని పలాస మండలం కేదార్పురం సర్పంచ్ బోడసింగి ధనుంజయరావు, కొంతమంది గ్రామస్తులు అన్నారు. ఈ మేరకు సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సర్వేనెంబర్ 33/1 లో గల 12 ఎకరాల 73 సెంట్లు జరాయితి గల చౌదరి భూములు మార్కెట్ విలువ ప్రకారం 7 లక్షల 15వేలు లక్షల రూపాయలకు పెద్దల సమక్షంలో ధర నిర్ణయించుకొని క్రయవిక్రయాలు జరిగాయి అయితే ఈ భూములపై కొంతమంది వ్యక్తిగత దూషణలతో దొంగ వ్యాపారాలు చేసి సొమ్ము గడించి ధనవంతులు అయ్యారని ఇటీవల కాలంలో పత్రికల్లో తప్పుడు వార్తలు రాయించడం సమంజసం కాదని అన్నారు. కొనుగోలు చేసిన భూములపై లావాదేవీలు ఉంటే పెద్ద మనుషుల సమక్షంలో తేల్చుకోవాలే తప్ప వ్యక్తిగత విలువలను దిగజార్చడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. కంబిరిగాం భూములపై కోరాడ శ్రీనివాసరావు చేపడుతున్న వ్యాపార అభివృద్ధి వల్ల చుట్టుపక్కల గ్రామాల వారికి ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయని దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని, లేనియెడల ఈ తప్పుడు కథనాల వల్ల ఉపాధి ఉద్యోగ అవకాశాలు కోల్పోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పైన ఉదాహరించిన 12 ఎకరాల 73 సెంట్లు భూమి లో ఐదు ఎకరాలు 50 సెంట్లు భూమిని నేరుగా దువ్వాడ వెంకట రామ్ చౌదరి నుంచి శ్రీనివాసరావు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, మిగిలిన ఏడు ఎకరాలు 23 సెంట్లు లో రెండు ఎకరాలు మాత్రమే మధ్యవర్తి ద్వారా అగ్రిమెంట్ పొంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మిగిలిన ఐదు ఎకరాల 23సెంట్లు రిజిస్ట్రేషన్ కావలసియున్నది. ఈ భూమల కొనుగోలు విషయంలో క్రయవిక్రయాలు సక్రమంగానే జరిగాయని, అయితే కొనుగోలు దారునికి మధ్యవర్తి పెంట ఉదయశంకర్ కు మధ్య చిన్న చిన్న మనస్పర్ధలు వల్లే ఇటువంటి తప్పుడు కథనాలు వస్తున్నాయని వారన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంటే కొంతమంది ఓర్వలేక భూములు కొనుగోలుదారులపై బురద జల్లుతున్నారని అన్నారు. స్థానికముగా కోరాడ శ్రీనివాసరావుకు గ్రామస్తులు యొక్క పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని వెల్లడించారు.

## మొక్కల పంపిణీ




**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 8(వార్త):** డొంకూరు పాఠశాల ఇంచార్జ్ సిహెచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో సత్యసాయి సేవా సంఘం డొంకూరు సౌజన్యంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డోంకూరు నందు సుమారుగా 25 మొక్కలు, అందులో జామ, నేరడీ, నిమ్మ, మొదలగు మొక్కలు పరిసరాలను నాటారు ఈ కార్యక్రమంలో సత్య సాయి సంఘం అధ్యక్షులు డి.తాతారావు, కార్యదర్శి ఆదినారాయణ, కో ఆప్షన్ సభ్యులు పాపారావు, భాస్కర్‌రావు, గురుమూర్తి, సురేష్, పాఠశాల ఉపాధ్యాయులు గోవిందరావు, శ్రీహరి, శంకర్ రెడ్డి, కమలాకర్‌రావు, పాఠశాల ఉపాధ్యాయిని స్వాతి పాల్గొన్నారు.

# శ్రీ చైతన్యలో రైజింగ్ ఇండియా స్మార్ట్ లివింగ్

**పలాస, సెప్టెంబరు 8(వార్త):** శ్రీ చైతన్య స్కూల్లో లో రైసింగ్ ఇండియా ప్రోగ్రాం సందర్భంగా ప్రిన్సిపాల్ వై.రామకృష్ణ మాట్లాడుతూ భారతదేశం అనేక సహజ వనరులు, మేధా సంపత్తి కలిగి ఉన్నాయి. వీటన్నిటిని విద్యార్థులు, యువత ఉపయోగించుకొని మన వస్తువులు మనమే తయారు చేసుకునీ ఈ సమాజానికి ఇచ్చే విధముగా విద్యార్థినీ విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కోరారు. గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థి దేశమంటే కొత్త ఆలోచనలకు పునాది పెట్టాలని అక్షరాస్యత పెరిగితే సమాజ అభివృద్ధి జరిగి తద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి సమాజంలో అసమా ఓనతలు తగ్గే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈకార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఏజీఎం సురేష్, ఆర్ ఐ ఎస్.రామినాయుడు, కోఆర్డినేటర్ ఏ.బాలరాజు అభినందించారు. కార్యక్రమంలో డీన్ ఎస్.జోగారావు ఐకాన్ సి బ్యాచ్ ఇంచార్జ్ కె.షణ్ముఖరావు మిడ్ స్కూల్ ఇన్చార్జ్ యుధిష్ట రెడ్డి, ప్రైమరీ ఇంచార్జ్ జి.నీలవేని, ఏ.ఓ జయబాబు స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం ఇన్చార్జెస్ మనోజ్ కుమార్, స్వాగతిక, నేతాజీ, బిర్లా, తిరుమలరావు, విద్యార్థులు పాల్గొన్నారు.




## జనసేన బీమా పరిహారం పంపిణీ

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 8(వార్త):** ఈదుపురంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ బీమా చెక్కు 5 లక్షలు రూపాయలు జనసేన నాయకులు అందించారు. గ్రామానికి చెందిన నెయ్యిల సత్యనారాయణ అకాల మరణం చెందడంతో నసేన పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రెసిడెంట్ టీం సభ్యులు స్వయంగా వచ్చి, జనసేన పార్టీ నాయకులు దాసరి రాజు ఆధ్వర్యంలో సత్యనారాయణ సతీమణి సావిత్రికి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధన రెడ్డి మండల అధ్యక్షురాలు దుర్గాసి నీలవేణి రెడ్డి , డైరెక్టర్ దుంగు భాస్కర్ రెడ్డి, డైరెక్టర్ రాజశేఖర్, వాలంటీర్ బాసి భారతి రెడ్డి , సంజు రౌలో, చింటూ బెహరా, మురళి బెహరా, మున్సిపాలిటీ ఇంచార్జిలు శ్యామ్, రుక్మిందరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నేషనల్ స్కాలర్ షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**వీరఘట్టం, సెప్టెంబరు 8(వార్త):** డిసెంబర్ 7న జరగబోయే నేషనల్ స్కాలర్ షిప్ (ఎన్.ఎం.ఎం.ఎస్) పరీక్షలకు జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పార్వతీపురం జిల్లా విద్యాశాఖాధికారి బి.రాజ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుని కుటుంబ సంవత్సరాదా యం రూ.3.5లక్షలు మించకూడదని తెలిపారు. ఈనెల 30లోగా www.bse.ap. gov.inద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్షలకు ఓసి, బిసి విద్యార్థిని విద్యార్థులకు రూ:100, ఎస్సి, ఎస్టి విద్యార్థిని విద్యార్థులకు రూ: 50ను అక్టోబర్ 10వ తేదీలోగా ఆన్లైన్ లో చెల్లించాలన్నారు. ఆన్లైన్ లో సమర్పించించిన దరఖాస్తును ధృవపత్రాలు, ఫీజ్ రసీదుతో సహా అక్టోబర్ 15వ తేదీలోగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. విద్యార్థిని విద్యార్థులు తమ పరీక్ష రుసుమును స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు పార్వతీపురంలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ పని దినములలో సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.



## 8.50 కేజీల గంజాయితో ముగ్గురి అరెస్ట్

**పలాస, సెప్టెంబరు 8(వార్త):** పలాస రైల్వేస్టేషన్ సమీపంలో కాశీబుగ్గ పోలీసులు సోమవారం తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమనాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న బ్యాగులను పరిశీలించగా వేర్వేరు కేసుల్లో 8.50 కేజీల గంజాయి స్వాదీనం చేసుకున్నామని కాశీబుగ్గ డి.ఎస్.పి వెంకటఅప్పారావు తెలిపారు సోమవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒరిస్సా రాష్ట్రం పర్లాకిమిడి నుంచి కేరళకు తరలిస్తున్న అక్రమ గంజాయిని వేర్వేరు కేసుల్లో సయ్యాద సుల్తాన్, బి అరుణ్ కుమార్, సుస్థిర్ మాలిను అరెస్ట్ చేసి వారి వద్ద మూడు సెల్ ఫోన్లు, 3870 రూపాయిలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈయనతోపాటు సిఐ పి సూర్యనారాయణ, ఎస్సై నరసింహమూర్తి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## సుశీల సేవలు ఆమోఘం



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 8(వార్త):** పంజా స్ట్రీట్ మోడల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సుశీల బోధనా విధానంలో వినూత్నతతో విద్యార్థులను ప్రోత్సహిస్తూ, విద్యారంగంలో విశేష కృషి చేసినందుకు మండలం లో "బెస్ట్ టీచర్ అవార్డు" అందుకోవడం పాఠశాలకు గర్వకారణమని, కుమార్తెను అదే పాఠశాలలో చదివిస్తూ అందరికీ ఆదర్శంగా ఉన్నారు అని ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రావు అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి కో అప్టెడ్ సభ్యులు కాళ్ల శ్రీనివాస రావు, ఉపాధ్యాయులు ఆది, రాణి, దుర్గ శైలజ, సౌజన్య, నాగమణి పాల్గొన్నారు.

## సంకల్పంపై అవగాహన



**జలుమూరు, సెప్టెంబరు 8(వార్త):** అంగన్వాడి కేంద్రాలలో వారం రోజుల పాటు సంకల్ప అనే అంశం పై అవగాహన నదస్సులు నిర్వహిస్తున్నామని ఐసిడిఎస్ సూపర్వైజర్ సీతారత్నం తెలిపారు. సోమవారం జలుమురు బాలికల ఉన్నత పాఠశాల లో పది అంశాలు పై అవగాహన కల్పించారు. పరిశుభ్రత పైన, భద్రత, పిల్లలకు చేతులు శుభ్రత, ప్రాథమిక భద్రత, పౌష్టిక ఆహారంపై పిల్లలు తల్లిదండ్రులకు అవగాహన సూపర్వైజర్ సీతారత్నం తేలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, బాలికల ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడు గంగయ్యకి సన్మానం

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 8(వార్త):** ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఈదుపురం గ్రామానికి చెందిన నర్తు గంగయ్యను మహతి సంస్క్రతిక కళా సేవా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి తిప్పన ధనుంజయ రెడ్డి ఆధ్వర్యంలో ఈదుపురం సత్యసాయి ప్రైమరీ స్కూల్ ఆవరణలో పూలమాల, దుస్సాలువా, మెమొంటో తో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ అధ్యక్షులు రంగాల జానకి రామ్ రెడ్డి, ప్రధాన సలహాదారులు తిప్పన దాలయ్య రెడ్డి, ప్రచార కార్యదర్శి చలపరాయి వినోద్ కుమార్, కోశాధికారి అప్పల హేమంత్, ఉప కోశాధికారి కారంగి త్రినాథ్ రెడ్డి, సలహాదారులు బొరా రామారావు రెడ్డి, దూడ్ల వెంకటేశం, గుజ్జు కూర్మారావ్, గొణప మోహనరావు, కొయ్యి మూర్తి, ఉమా శంకర్ ఆచారి, కరగాణా లక్ష్మీనారాయణ, తులసయ్య తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు సకాలంలో యూరియా సరఫరాకు ప్రభుత్వం కృషి

**నరసన్నపేట, సెప్టెంబరు 8(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్లో రైతులకు సకాలంలో యూరియా అందించేందుకు చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. నరసన్నపేట మండలం, కరగాం రైతు సేవా కేంద్రంలో ఎరువుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల ఇతర దేశాలతో జరిగిన స్వల్ప వివాదాలతో యూరియా మన దేశానికి రాష్ట్రానికి రావడం లో జాప్యం జరిగిందని వివరించారు. ఈ క్రమంలోనే యూరియా అందించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని వివరించారు. తాను ఎమ్మెల్యే అయినప్పటికీ ఎరువుల వాడకం పట్ల అవగాహన ఉందని ఎక్కువ యూరియా వేస్తే దిగుబడులు రావని వివరించారు. తాను సొంత



అనుభవంతో తెలియజేస్తున్నానని యూరియా తక్కువ మోతాదులో వాడుకోవాలని సూచించారు. ఏది ఏమైనప్పటికీ రైతులకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, తహశీల్దార్, పోలాకి పిఎసిఎస్ చైర్మన్ భైరి భాస్కరరావు, సర్పంచ్ పంగ బాబాజీ నాయుడు, నీటి సంఘం అధ్యక్షులు శిమ్మ లక్ష్మణరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాధు ఆనంద్, పీస మోహన్ స్థానిక నాయకులతో పాటు పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై మంత్రి లోకేష్ సమావేశం నిర్వహించాలి



**వీరఘట్టం, సెప్టెంబరు 8(వార్త):** విద్యారంగ సమస్యలపై విద్యాశాఖ మంత్రి సమావేశాన్ని నిర్వహించాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎండి సత్యనారాయణ రెడ్డి అన్ను వెంకటరావులు కోరారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పింఛను అమలు చేయాలని, ప్రభుత్వం పిఆర్సి ని ప్రకటించాలని, డిఏ మరియు సరెండర్ లీవ్ బకాయిలను తక్షణమే చెల్లించి ఉద్యోగ ఉపాధ్యాయు లను ఆదుకోవాలని కోరారు అలాగే, ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు ను వెంటనే రిలీవ్ చేసి, వారి స్థానములో డీఎస్సీ 2025 అభ్యర్థులను నియమించాలని, విద్యాశాఖ మంత్రి ,విద్యారంగ సమస్యలపై సమావేశం నిర్వహించాలని వారు కోరారు,. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి సోంబర, ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సిబ్బంది, అన్ను వెంకట్రావు ను ఘనంగా సత్కరించారు.

## యూటీఎఫ్ రణభేరి జాతాను విజయవంతం చేయండి

**పలాస, సెప్టెంబరు 8(వార్త):** పాఠశాల విద్యారంగ సమస్యలు, ఆర్థికపరమైన సమస్యలపై ఈనెల 15 నుంచి 19 వరకు జరిగే యుటిఎఫ్ రణభేరి జాతాను విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ కిషోర్ కుమార్ పిలుపునిచ్చారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం సాయంత్రం జిల్లా కార్యదర్శి కె రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచిన ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం చేయలేదన్నారు. ప్రధానంగా ఆర్థిక విద్యారంగ సమస్యలు పరిష్కారం కాకపోగా మరింత జటిలంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు బదిలీలు ప్రమోషన్లు పూర్తి అయ్యి మూడు నెలలు కావస్తున్న ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లో కొనసాగుతున్నారని, మూడు నెలలుగా ఎంటిఎస్ ఉపాధ్యాయులకు జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారిన ప్రపంచ బ్యాంకు సాల్ట్ పథకం రాష్ట్రంలో అమలు చేయడం ద్వారా ప్రభుత్వ విద్య వ్యవస్థ మరింత బలహీన పడుతుందన్నారు. మూడో వంతు ప్రైమరీ పాఠశాలలు సింగిల్ టీచర్లు స్కూల్ గా మారిపోయాయని సగం పైన హై స్కూల్స్ సింగిల్ సబ్జెక్టు టీచర్లుగా తయారైనాయని హైస్కూల్లో పనిచేయాల్సిన స్కూల్ అసిస్టెంట్స్ సర్ప్లు పేరుతో క్లస్టర్




టీచర్లుగా ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ గా పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యమైన విద్యను అందిస్తామని చెబుతూనే ఉపాధ్యాయులను బోధ నేతర కార్యక్రమాలకు పరిమితం చేయడం దారుణమన్నారు. విద్యార్థులకు నాలుగు అక్షరాలు చెప్పాలనే విధంగా కాకుండా ఆన్లైన్ అప్లోడింగ్ కార్యక్రమాలు విద్యాసక్తి స్వచ్ఛందం అంటూనే ఉపాధ్యాయులను బలవంతం చేయడం ఉపాధ్యాయులపై యాప్ ల పని భారం, పి 4, విద్యాశక్తి కార్యక్రమాలు, పరీక్ష మూల్యాంకనం, ఆన్లైన్ అప్లోడ్, గ్రీన్ పాస్పోర్ట్ మొదలైన బోధనేతర పనులు పనిభారం విపరీతంగా ఉపాధ్యాయులపై మోపుతున్నారని, తద్వారా విద్యాబోధనకు ఆటంకంగా ఉందన్నారు. పిఆర్సి కమిషన్ వెంటనే నియమించాలని, డిఎలు విడుదల చేయాలని, ఐఆర్ తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. 57 మెమో ప్రాప్తికి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలలో సెప్టెంబర్ 15 నుండి 19 వరకు యుటిఎఫ్ రణభేరి జాత జరుగుతుందని, తదుపరి సెప్టెంబర్ 25న రాష్ట్రంలో బహిరంగ సభ ద్వారా యుటిఎఫ్ రణభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమాలను ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్ బాబురావు, జిల్లా కార్యదర్శి జి రమేష్ రాష్ట్ర కౌన్సిలర్లు గుంట కోదండరావు, బల్ల చిట్టిబాబు జిల్లా అకాడమిక్ సెల్ కన్వీనర్ ఎల్ వెంకటాచలం పలాస వజ్రపు కొత్తూరు, మందస అధ్యక్ష కార్యదర్శిలు తమ్మినాన జయరాం, ఎస్ వీ రమణ, కె జయరాం డీ ఈశ్వర్ రావు ప్రసాదరావు గోండు మధు మాధవ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## యూరియాపై రైతులు ఆందోళన చెందవద్దు



**మందస, సెప్టెంబరు 8(వార్త):** ఖరీఫ్ సీజన్ లో వరి పంట సాగు చేస్తున్న రైతాంగం యూరియా లభ్యతపై అనవసరమైన ఆందోళన చెందవద్దని, రైతులకు సరైన అవగాహనే ముద్దు అని మందస వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. ఈ మేరకు ఆయన వరి పండిస్తున్న మహిళా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లొహరిబంద సచివాలయం పరిధిలో గల మహిళా రైతు సంఘాల ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. జిల్లా వరి సాగు విస్తీర్ణంకు శాస్త్రీయ పద్ధతిలో ఉపయోగించడానికి సరిపడా యూరియా నిల్వలు మన జిల్లాలోనే నిల్వ ఉన్నట్లు జిల్లా అధికార యంత్రాంగం సూచనలను అర్థం చేసుకోవాలని వివరించారు. ఒక ఎకరా వరి పొలానికి 25కిలోలు యూరియా ఒక మోతాదులో వేయడానికి సరిపోతుందని అవగాహన కల్పించారు. మూడు పర్యాయాలు ఎకరాకు 75కిలోలు చొప్పున రైతులందరికీ విడతలు వారిగా రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ప్రైవేటు డీలర్లు ద్వారా స్థానిక సచివాలయం రెవిన్యూ, అగ్రికల్చర్ అసిస్టెంట్ ల సహకారంతో రైతులు అందరికీ కూపన్ లను ఇచ్చి సరిపడా యూరియా అందించే ప్రణాళికతో జిల్లా యంత్రాంగం ఉందన్నారు. రైతులందరూ అర్థం చేసుకుని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. రైతులు ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే 9121863788 టోల్ ఫ్రీ నెంబర్ కు సంప్రదించవచ్చని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఓఏ రాజేశ్వరి, క్లస్టర్ కోఆర్డినేటర్లు మంగమ్మ, ముఖలింగం పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## నవోదయ ఫలితాలలో 'సూర్యోదయ' విద్యార్థుల ప్రతిభ

**మందస, సెప్టెంబరు 8(వార్త):** నవోదయ పరీక్షా ఫలితాలలో మరోసారి సూర్యోదయ స్కూల్ విద్యార్థుల ప్రతిభ చూపించారు. ఈ పరీక్షల్లో ప్రతీ ఏటా సూర్యోదయ విద్యార్థులు ప్రభంజనం కొనసాగిస్తున్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో గౌడు దేవీప్రసన్న(హాల్ టికెట్ నెంబర్ 1113494), శిష్ట సుదీశ్ జవహర్(హాల్ టికెట్ నెంబర్ 1056066) నవోదయ ఫలితాల్లో ఎంపికయ్యారు. జవహర్ నవోదయ విద్యాలయంలో సీటు సాధించడం ఒక పెద్ద విజయమని, ఈవిజయం పాఠశాల విద్యార్థుల సామర్థ్యాన్ని చాటడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలనే సంకల్పాన్ని సూర్యోదయ స్కూల్ ధృవీకరిస్తుందని స్కూల్ డైరక్టర్ మోణంగి నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ పిల్లి లోకేశ్వరరావు చెప్పారు. నవోదయకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



# అభివృద్ధే మా లక్ష్యం : వజ్జ

**-29వ వార్డులో కాలువ**

**విస్తరణ పనులకు శంకుస్థాపన**



**పలాస, సెప్టెంబరు 8(వార్త):** కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పలాస మున్సిపాలిటీ అభివృద్దే మా లక్ష్యమని ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జా బాబురావు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 29వ వార్డు రాజమ్మకాలనీ హాస్టల్ వీది లో రూ.5 లక్షలతో కాలువల విస్తరణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. వార్డు కౌన్సిలర్ జోగ త్రివేణి మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు లోడగల కామేష్ యాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణరావు, జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు టాంకాల రవిశంకర్ గుప్తా, కొరికాన శంకరరావు, సవర రాంబాబు, తాతయ్య, రాజారావు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా రైస్ మిల్లర్ల ట్రెజరర్‌గా తంగుడు నాగేశ్వరరావు

**నరసన్నపేట, సెప్టెంబరు 8(వార్త):** శ్రీకాకుళం రైస్ మిల్లర్ల అసోసియేషన్ ట్రెజరర్గా నరసన్నపేటకు చెందిన రైస్ మిల్లర్ తంగుడు నాగేశ్వరరావును నియమించారు. జిల్లా కేంద్రంలో ఇటీవల మిల్లర్ల సంఘం ఆధ్వర్యంలో ఎన్నికలలో ఆయనను నియమిస్తూ ప్రకటించారు. ఈ క్రమంలో సోమవారం నరసన్నపేట కలింగ వైశ్య సంఘం స్థానిక సంఘ భవనంలో రైస్ మిల్లర్లు ఆయనకు ఘనంగా సత్కరించి అభినందించారు. నరసన్నపేటకు ఈ పదవి రావడం పట్ల స్థానిక మిల్లర్లు హర్షం వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు హెూం వర్క్‌తో పాటు డిక్టేషన్ చేపట్టాలి



**నరసన్నపేట, సెప్టెంబరు 8(వార్త):** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రతి రోజు హెూం వర్కో పాటు డిక్టేషన్ అలవాటు చేయాలని ఎంఈఓ ఉప్పాడ శాంతారావు తెలిపారు. నరసన్నపేట మండలం గొట్టిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ మేరకు విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించి విద్యార్థులకు తగు సూచనలు చేశారు. ఉపాధ్యా యులకు ఆదేశిస్తూ ప్రతిరోజు హెూం వర్క్ తో పాటు పాఠశాలలో డిక్టేషన్ చేపట్టాలని పేర్కొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత





**పలాస, సెప్టెంబరు 8(వార్త):** అక్రమంగా పిడిఎస్ బియ్యాన్ని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాలి నుండి ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ కు ఐచర్ వాన్ లో తరలిస్తుండగా శ్రీకాకుళం జిల్లా పలాస మండలం లక్ష్మీపురం టోల్ గేటు వద్ద జాతీయరహదారిపై కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారు. కోటబొమ్మాలి,టెక్కలిలో సేకరించిన పిడిఎస్ బియ్యాన్ని ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారాన్ని అందుకున్న కాశీబుగ్గ పోలీసులు, పలాస టోల్ ప్లాజా వద్ద మాటువేసి పట్టుకున్నారు. అనంతరం బట్టుకున్న బియ్యం పిడిఎస్ బియ్యమా? కాదా? అని తెలుసుకునేందుకు రెవెన్యూ అధికారులకు పోలీసులు తెలియజేయగా, పరీక్షించిన పలాస రెవెన్యూ అధికారి తిరుపతిరావు, పట్టుబడ్డ బియ్యం పిడిఎస్ బియ్యమేనని, సుమారు 10 టన్నులు పైబడి ఉండవచ్చని తెలియజేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పిడిఎస్ బియ్యంతో పట్టుబడ్డ వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## రాష్ట్ర పోటీలకు టెన్నికాయిట్ జట్ల ఎంపిక

**పలాస, సెప్టెంబరు 8(వార్త):** పలాసలో టెన్నికాయిట్ జట్ల ఎంపిక సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రవికుమార్, మల్లా భద్రయ్య, రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి. తవిటయ్య ,జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మల్లా సంతోష్ కుమార్, ఎస్.వి. జోగారావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.తారక్, వ్యాయామ ఉపాధ్యాయులు బి.శంకర్రావు పి.రాజేశ్వరి, న్యాయ నిర్ణేత ఎం.దామోదర్ పాల్గొన్నారు.

పురుషుల జట్టు:- బి. సిద్ధార్థ, కె. ప్రవీణ్ కుమార్ ,బి .ఉదయ్ కిరణ్ ,ఎల్ రోహిత్ కుమార్.

స్త్రీల జట్టు :- పి శ్రావణి పాత్రో,ఎన్ .దివ్య, పి కావ్య, కె. వసుంధర.



## మున్సిపాల్టీ కమిషనర్‌కి ఘన సన్మానం



**పలాస, సెప్టెంబరు 8(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాల్టీ కమిషనర్ నడుమురి రామారావు జన్మదిన శుభ సందర్భంగా టీడీపీ నాయకులు హనుమంతు మురళీమోహన్ దొర, బీజేపీ నాయకులు లక్కోజు ధర్మారావు, మరియు వీరఘట్టపు వెంకటరావు, బోండా శ్రీనువాస రావు. కమిషనర్ కి సోమవారం జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా కూటమినేతలు మాట్లాడుతూ మున్సిపాలిటీ కమిషనర్ గా ఆయన సేవలు మరువలేమని, నిత్యము పని రాక్షసుడుగా పేరు తెచ్చుకుని ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. పలాస కాశీబుగ మున్సిపాల్టీలో ఆయను చేస్తున్నటువంటి సేవల గుర్తిస్తూ కూటమి నేతలు ఆయనకు ఘనంగా సన్మానం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేసారు.

## ఎరువుల కొరత లేదు



**పలాస, సెప్టెంబరు 8(వార్త):** పలాస మండలంలో ఎరువులకు కొరతలేదని తాసిల్దార్ కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. సోమవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాలు మేరకు బొడ్డపాడు గ్రామ పంచాయతీ సచివాలయంలో జరుగుతున్న ఎరువులు పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎరువులు సరఫరా మేరకు అన్ని సచివాలయాల్లో ఉన్న రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల ప్రకారం ప్రతి ఒక్కరికి ఎరువులు అందించమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలాస వ్యవసాయ అధికారి పోలారావు, ఇంచార్జి ఉద్యానవన శాఖ అధికారి ఝాన్సీ, పంచాయతీ సెక్రటరీ రవి, వీఆర్వో సింహాచలం, ఏడి మహేష్, పలాస పిఎసిఎస్ డైరెక్టర్ బొడ్డు దుష్యంత్, గ్రామ ఎన్ డి ఏ కూటమి నాయకులు కిక్కర ఢిల్లీరావు, మురుపింటి కుమార్ రాజ్, సార జోగారావు, మామిడి కమల, గర్తం తులసిరావు, బొడ్డు మోహన్ రావు, పోతనపల్లి చిరంజీవి, తామాడ అప్పారావు, బుడత కాంతారావు, రాజాం జానకిరావు, బొడ్డు శ్రీనివాస్, తామాడ నరేష్,బొడ్డు జగన్, సాలిన ప్రవీణ్, బొడ్డు యుగంధర్, బొడ్డు పాపారావు, నౌగాపు సింహాచలం, తామాడ త్రిలోచనరావు, దాసరి శ్రీరాములు, మురుపింటి గంగయ్య,రాజాం గుణవంతు,రాజాం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## శ్రీముఖలింగేశ్వరానికి పోటెత్తిన భక్తులు



**జలుమూరు, సెప్టెంబరు 8(వార్త):** శ్రీముఖలింగంలో ఉన్న శ్రీముఖలింగేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం చంద్రగ్రహణం అనంతరం స్వామివారిని దర్శించుకోవడానికి తరలివచ్చారు. స్వామివారికి ప్రీతికమైన సోమవారం కావడంతో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఎవ రికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలను ఈవో వాసుదేవరావు తెలిపారు.

## విద్యార్థుల సామర్థ్యాలు మరింత మెరుగుపడాలి



**జలుమూరు, సెప్టెంబరు 8(వార్త):** ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సామర్థ్యాలు మరింత మెరుగుపడాలని ఎంఈఓ బమ్మిడి మాధవరావు సూచించారు. జలుమూరు మండలం బసివాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ క్రమంలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం తప్పనిసరిగా మెనూ ప్రకారమే అమలు చేయాలని పేర్కొన్నారు.

## షాపింగ్ మాల్‌లో తనిఖీలు

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 8(వార్త):** ఇచ్ఛాపురం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో మాదక ద్రవ్యాలు గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు పోలీస్ జాగిలం కెనైన్ తో విస్తృత సోదాలు నిర్వహించారు. ఎం తోటూరు లో హరివిల్లు సూపర్ మార్కెట్ , సాయా సెంట్రల్ లో తనిఖీ లు నిర్వహించారు. రూరల్ ఎస్ ఐ ఈ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546